# నాన్న డైరీ



తాతయ్య చనిపోయాడన్న వార్త తెలిసి షాక్ తిన్నాను...

ఢిల్లీ నించి బయల్దేరానన్న మాటేగాని... నా ఆలోచన్లన్నీ తాతయ్య చుట్టే తిరుగుతున్నాయి...

రైలు కదిలింది...

ఢిల్లీలో ఇంజనీర్‌గా ఉద్యోగమొచ్చాక రెండేళ్ల తర్వాత 'జగిత్యాల' వెళ్తున్నాను.

మమ్మీ డాడీల్తో ఫోన్లో మాట్లాడినప్పుడు... 'తాతయ్యతో మాట్లాడించండి' అంటే తాతయ్య ఒకే మాట మట్లాడాడు.

"ఫోన్‌లో ఏం మాట్లాడతాం రా... రెండు నిమిషాలు మాట్లాడగానే మనసంతా 'బిల్లు' భయం పట్టుకుంటుంది, అందుకే ఉత్తరం రాస్తాను" అని

తర్వాత... నెలకో ఉత్తరమైనా రాసేది...

ఆ ఉత్తరం నిండా ఊరి కబుర్లు... బలమైన కవిత్వం... ఎక్కువగా ఉండేది.

అలాంటి తాతయ్యనించి ఏడాదిగా ఏ ఉత్తరమూ లేదు.. కారణం... తాతయ్య మంచాన పడ్డాడని... లేవలేని స్థితిలో వున్నారని డాడీ ఫోన్లో చెప్పాడు.

ఇప్పుడు... తాతయ్యని కనీసం చివరిసారిగానైనా పలకరించలేకపోయానే అన్న బాధ గుండె బరువుని పెంచుతోంది.

నిజానికి... తన కొడుకుల్ని ఉన్నతంగా ఎదిరించి... మనవళ్లనీ, మనవరాళ్లనీ అల్లారు ముద్దుగా చూసే తాతయ్య లేరంటే... తట్టుకోలేక పోతున్నాను. ఏడాది కింద తాతయ్య రాసిన ఉత్తరం తీసి చదివాను...

ఏవో చెప్పలేని... చెప్పుకోలేని బాధ ఆ అక్షరాల అంతరాల్లో కన్పించినట్టయింది. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలై పోతున్నాయని... వస్తు సంస్కృతి... బంధుత్వాల్ని దూదిపింజాలుగా చేసి ఎగరేస్తోందనీ రాసాడు.

ఉత్తరం చదవటం పూర్తి కాకుండానే... మళ్లీ తాతయ్య జ్ఞాపకాలు చుట్టు ముట్టాయి.

బెర్తు పైకెక్కి... కళ్లుమూసుకొని తాతయ్యకి జ్ఞాపకాల్తో గంటసేపు మౌనం పాటించాను.

*** **** ****

ఇంట్లో అడుగుపెట్టగానే తాతయ్య ఫోటో చూసి గుండె ముక్కలయింది.

అమ్మని పట్టుకొని బావురుమని ఏడ్చాను.

డాడీ, బాబాయిలు, 'పెద్దకర్మ' రోజు ఏర్పాట్లలో మునిగిపోయారు. ఇంట్లో స్మశాన స్తబ్దత మెల్లగా పలుచబడుతోంది.

తెల్లారితే పదకొండోరోజు...

ఈ పదిరోజుల్లోనే వీళ్లందరూ మునుపటి ఆనందోత్సాహాల స్థాయికి వచ్చేసారు.

అమ్మనైతే చెల్లాయికి సెటిల్ కాబోతున్న అమెరికా సంబంధం గురించే చెప్తోంది. చెల్లాయి కూడా... అమెరికా మీద మళ్లీ ఏదేశమైనా విమాన దాడులు చేస్తుందా అన్నయ్యా... అనడుగుతోంది.

మర్నాడు.

ఇంటిముందు పెద్ద షామియానా వేసారు.

దాదాపు వెయ్యిమందికి సరిపడా వంటలు వండిస్తున్నారు... తాతయ్య

నిలువెత్తు ఫోటోకి గంధం చెక్కల దండ వేసారు.

ముగ్గురు కొడుకులు పెద్ద పెద్ద ఉద్యోగస్తులే కాబట్టి.... పెద్ద పెద్ద వాళ్లంతా వచ్చి పలకరిస్తున్నారు.

బ్రాహ్మడి కార్యక్రమం అయ్యాక ఒక్కొక్కరూ తాతయ్య ఫోటోకి దండం పెట్టి భోజనాల వైపు వెళ్తున్నారు.

"ఇంత మంచి కొడుకుల్ని కన్నందుకు ధన్యుడివి తాతయ్యా" అనుకున్నాను.

నిజానికది పెద్దకర్మలా లేదు... పెళ్లి సందడిలా వుంది.

మా వాడలోని పేదవాళ్లకి కాటన్ చీరెలు, దోవతులు, పంచెలు పంచిపెట్టారు.

"మానాన్న మాకోసం కష్టపడ్డాడు. అందుకే ఆయన ఫంక్షన్‌ని ఇంత గ్రాండ్‌గా చేస్తున్నాం" అంటున్నాడు పెదనాన్న ఎవరితోనో...

"మా మామయ్య మాకు దేవుడు... మమ్మల్ని కూతుళ్లలాగా చూస్కున్నాడు" అంటోంది మా మమ్మీ మా బంధువావిడతో...

"మేమీ స్థాయిలో వుండడానికి మా నాన్నే కారణం... అందుకే లక్ష రూపాయల్తో ఈ ఫంక్షన్ చేస్తున్నాం." చిన్నాన్న మరొకరితో చెప్తున్నాడు. డాడీయేమో భోజనాల దగ్గరుండి కొసరి కొసరి వడ్డిస్తున్నాడు.

"తాతయ్యా... నువ్వు అదృష్టవంతుడివి..." మరోసారి అనుకున్నాను.

ఇంతలో పనిమనిషి వచ్చి మమ్మీతో... "అమ్మగారు... పెద్దయ్య గారి గది శుభ్రం చేసాను. సర్ఫ్ వేసి ఫినాయిల్ పోసి బాగా కడిగాను అని చెప్పింది. మమ్మీ, పిన్నీలు మంచి బట్టలు, నగలు వేసుకోవటం ఆ వాతావరణంలో అసహజంగా అన్పించింది.

తాతయ్య జ్ఞాపకాల కన్నా... వేరే విషయాల ప్రస్తావన ఎక్కువ జరగటం మరింత అసందర్భంగా అన్పిస్తోంది కూడా... అయినా సర్దుకొని "ఎవరి గదమ్మా... అనడిగాను.

"మీ తాతయ్య గదిరా... శుభ్రం చేయించాం. గెస్ట్ రూంగా మారుద్దామని" అనేసి ఎవరో పిలిస్తే వెళ్లింది.

ఆరాటంగా నా అడుగులు తాతయ్య గదివైపు కదిలాయి.

మసక బారినట్టున్న గది... గుప్పుమంటున్న ఫినాయిల్ వాసనతో ఏదో వెగటు వాసన...

గోడకి నానమ్మ ఫోటో....

షెల్ఫ్‌లో తాతయ్య పుస్తకాలు... అపురూపంగా తడిమాను వాటిని. ఓ పుస్తకం కిందపడింది.

అది తాతయ్య డైరీ, దుమ్ము పట్టి వుంది.

అప్రయత్నంగా ఎక్కడో మధ్య పేజీ తెరిచాను.

జులై... పదహారు...

'గొంతెండి పోతుందన్నా... గుక్కెడు నీళ్ళు ఎవ్వరూ ఇవ్వటం లేదు...

భగవంతుడా... నన్ను తీస్కెల్లు...

ఆ వాక్యం చదివి... గుండె చిట్లిపోయింది. ఆదుర్దాగా మరో పేజీ తిప్పాను.

ఆగస్టు... మూడు...

వీళ్లు నన్ను బతికించుకుంటున్నది కేవలం పెన్షన్ డబ్బులకే అని తెల్సి... చచ్చిపోవాలన్పిస్తోంది.

ఎక్కడో హృదయాంతరాలల్లో భీకర కంపనాలు పాకిపోతున్నాయి.

ఆగస్ట్... పదమూడు...

అయిదోది సదువంగా 'అయ్యా' ని పిలిస్తివి.

ఏడోది సదువంగ 'బాపూ' అంటివి

పదోది పట్టాక 'నాన్నా' అనంటివి

కాలేజీ బోయాక 'డాడీ' అంటూ...

పెండ్లా మొచ్చాక 'గాడిదీ' అంటివి

గ్యానమెరుగని సదువులెందుకురో

కొడుకా...

కట్టె కాలక ఆరిపోతవ్‌రో...

(చిన్నోడ్ని హాస్పిటల్‌కి తీసికెళ్లరా అంటే 'చావరా గాడిదా' అని తిట్టాడు)

సెప్టెంబర్... ఒకటి...

పెద్దోడేమో... నీకన్నా అమ్మ బతికున్ని బావుండేది అన్నాడు.

అమ్మ గోరుముద్దలు తినిపిస్తే... దేవతయ్యింది.

అమ్మచేతికి ఆ ముద్దలందించిన నాన్న దయ్యమయ్యాడు

లాలిపాటతో జోకొట్టి నిద్ర పుచ్చిన అమ్మ గాయని అయ్యింది.

చదువుకో కన్నా అంటూ నిద్ర లేపిన నాన్న గుండెకు గాయమే మిగిలింది.

అమ్మవన్ని కమ్మని మాటలే... మమతల మూటలే...

బరువు, బాధ్యతలు ప్రేమని కప్పేసినా పూలబాటలు పరిస్తే... నాన్నకి మిగిలేవి కన్నీటి మూటలు... కర్కశమాటలేనా...?

సెప్టెంబర్... ఇరవై రెండు...

మలమూత్రాలు మంచంలోనే పోసుకుంటున్నానని అన్నం పెట్టడం తగ్గించారు...

ఆకలి తెల్సిన అమ్మ కడుపునే చూసిండొచ్చు...

భవిష్యత్తుని వెదుకుతూ నాన్న కళ్లలోకి చూస్తాడా...

ఆ చూపులకు అపార్థాలు వెతుక్కొని... కన్నీళ్లు తెప్పించినా నాన్న శపించట్లేదు.....

తన పెంపకంలోనే లోపముందని దుఃఖిస్తున్నాడు.

అక్టోబర్.... ఏడు...

అమ్మ అందని చందమామనే చూపించింది...

అందనిదెప్పుడూ ఆనందంగానే వుంటుందిరా.

నాన్న బంగారు దారిని చూపించాడు

కాని... గమ్యం చేరాక నాన్నని మర్చిపోయావ్

రేపు... నీ కొడుకూ అలా కాకుండా జాగ్రత్త పడరా కన్నా...

అక్టోబర్... పద్నాలుగు...

.... రెండు రోజుల్నించీ కనీసం అన్నం కూడా లేదు.

గదిలోకి ఎవరూ రావటం లేదు.

నవంబర్... అయిదు...

అమ్మ దేవుని ప్రతినిధి అయితే...

అమ్మ వెనకాల నిల్చున్న నాన్న... సైతాన్ ఎందుకవు తాడ్రా...

అమ్మ గుండెలోని నాలుగ్గదుల్లో ప్రేమే నిండి వుంది.

కాని...

నా గుండె గదుల్లో శ్రమ, బాధ్యత, భవిష్యత్తు, ఆందోళన నిండిపోయాయి.

వాటిలో మమేకమైన ప్రేమని చూడటం...

మీ అమ్మకు తప్ప... మీకెన్నడూ సాధ్యం కాదేమో...?!!

నవంబర్... ఇరవైమూడు....

'నా...కు... ఆ...క...లే...స్తో...ం...ది...

సత్తువ లేక అక్షరాలు తడబడ్డట్టు... ఆ వాక్యం నన్ను కుదిపేసింది.

నవంబర్ ఇరవై అయిదు...

రాక్షసులంతా వెళ్లి బ్రహ్మదేవున్ని
కలికాలంలో మా పరిస్థితేంటని అడిగితే...
ఇంటింటికీ కొడుకులై పుడతారని వరాన్నిచ్చిన
ఆ దేవుడ్నే శపిస్తున్నాను...
"ఒరేయ్ దేవుడూ... న్నువ్వు న్నాన్నవై పుట్టుదువ్ గాక...!"

నవంబర్... ఇరవై ఆరు...

ఆ...క...లి...

'వెగటు వాసనేస్తోందని కనీసం నా గదివైపు కూడా ఎవరూ రావటం లేదు'

నవంబర్... ఇరవై తొమ్మిది...

ఆ...క...లి...

ఆ...క...లి...

ఆ తర్వాత తాతయ్య డైరీ నిండా తెల్లపేజీలే...

తాతయ్య మనసు లాంటి తెల్లపేజీలు....

కళ్లు కన్నీళ్లతో కప్పబడితే... ఏమీ కన్పించని పేజీలు...

డైరీని గుండెలకు హత్తుకొని... బావురుమన్నాను...

కిటికీలోంచి చూసాను....

"ఇంత గొప్ప కొడుకుల్ని కన్న మీ నాన్న ఆత్మ తప్పక శాంతిస్తుంది." డాడీతో ఓ పెద్ద ఆఫీసర్ అంటున్నాడు.

'దేవున్ని కాదు తాతయ్యా... వీళ్లని శపించు...'

నా గుండె రోదిస్తూనే వుంది...

* * *